పంట చేనుకు పండగ

- ఆర్బీకేల్లోనే అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- పెట్టుబడి ఖర్చు తగ్గించేందుకు అధునాతన యంత్రాల సరఫరా
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన సీఎం జగన్



బిళ్లనందూరులో వరిసాగుపై అవగాహన కల్పిస్తున్న వీఏఏలు(ఫైల్)

కోటనందూరు: వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మాటలు తప్పని నిరూపిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడే రైతన్నకు ఏటా ఖరీఫ్‌కు ముందు పెట్టుబడి సాయాన్ని అందించి సాగును లాభసాటిగా చేశారు. గతంలో సాగు పరంగా ఏ అవసరం వచ్చినా ఎక్కడకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉండేది. విత్తనాలు, పురుగుమందులు, ఇతర సహాయాల కోసం మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి భూసార పరీక్షలు, సాగుపై అవగాహనతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పరికరాలు, యంత్రాలు రైతుల ముంగిటకే తీసుకొచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పండించిన పంటను సైతం వ్యవసాయశాఖ సిబ్బంది రైతు కళ్లాలకు వెళ్లి సేకరించి, నేరుగా బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ చేసే పరిస్థితి వచ్చింది. గత నాలుగేళ్లలో సాధారణం కన్నా రెట్టింపు వర్షాలు కురిశాయి. దిగుబడులు కూడా అదనంగానే వస్తున్నాయి. కోటనందూరు మండలం వరిసాగులో తాండవ జలాశయంపై ఆధారపడి ఉంటుంది. గత నాలుగేళ్లగా తాండవ జలాశయం సైతం నిండుకుండలా మారి తొణికిసలాడుతూ కర్షకులకు కొండంత ధైర్యాన్నిస్తుంది.

కోటనందూరు మండలంలో 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 10,289 మంది రైతులు 16,616 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. 10,247 ఎకరాల్లో వరిసాగు చేస్తుంటుండగా మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు పండిస్తున్నారు. వరిసాగులో తాండవ జలాశయం కింద 7,633 ఎకరాలు, చెరువుల కింద 1881 ఎకరాలు, బోర్ల కింద 733 ఎకరాలు సాగు చేస్తున్నారు. వరిరైతుల అవసరాలు అనుగుణంగా ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో 3,600 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచారు.



పాతకొట్టాం రైతుభరోసా కేంద్ర వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆర్బీకే	రైతుల సంఖ్య	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ప్రభుత్వ లబ్ధి (ఎకరాల్లో)
కోటనందూరు-1	387	520	31.1
బొద్దవరం	355	450	26.6
జగన్నాథపురం	410	970	42.5
ఇండుగపల్లి	419	1132	31.5
కేఏ మల్లవరం	1182	1236	74.3
భీమవరపుకోట	895	1600	71.1
పాతకొట్టాం	1398	2871	86.5
సూరపురాజుపేట	720	1157	54.0
అల్లిపూడి-1	422	670	31.5
కోటనందూరు-2	362	540	27.1
కొత్తకొట్టాం	682	1064	51.1
అల్లిపూడి-2	435	620	32.5
బిళ్లనందూరు	756	860	62.5
కేఈ చిన్నయ్యపాలెం	1024	2118	64.2
కాకరాపల్లి	810	808	49.0
	10,257	16,616	735.5

ఊళ్లోనే విత్తనాలు



నేను మూడెకరాల్లో వరిసాగు చేస్తున్నాను. గతంలో విత్తనాలు, ఎరువులు మండల కేంద్రానికి వెళ్లి క్యూలో నిలబడి తెచ్చుకోవాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పరిస్థితి లేదు. కావలిసినన్ని విత్తనాలు ఊళ్లోనే రైతు భరోసా కేంద్రం నుంచి తెచ్చుకుంటున్నా. ఎంతో సంతోషంగా ఉంది.

– మాతిరెడ్డి నూకరాజు, రైతు, జగన్నాథపురం

లాభసాటిగా వ్యవసాయం



మాది బొద్దవరం గ్రామం. ఐదెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ఏటా సీఎం జగన్ పెట్టుబడి సాయంతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నాను. రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయశాఖ సిబ్బంది మెరుగైన సేవలందిస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటుధర కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారు.

– రామసూరి సత్యనారాయణ, రైతు, బొద్దవరం

వ్యవసాయ సిబ్బంది సేవలు అద్భుతం



జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత వ్యవసాయం పండగలా మారింది. గతంలో వ్యవసాయశాఖ సిబ్బంది కనిపించేవారు కాదు. ఇప్పుడు పొలాల్లోకి వెళ్లి మరీ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. సాగులో ఎరువుల యాజమాన్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటుధర కల్పిస్తోంది. ధాన్యం నేరుగా వ్యవసాయ సిబ్బందే కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానాలు అద్భుతంగా ఉన్నాయి.

– గాడి భద్రాచలం, రైతు, ఎస్సార్‌పేట

క్లుప్తంగా

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



తిరుచ్చి వాహనంపై దర్శనమిచ్చిన సత్యదేవుడు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద ఉన్న ఆలయ ప్రాంగణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసిననంతరం వేదపండితుల మంత్రోచ్చాటన మధ్య, మంగళవాయిద్యాల నడుమ ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. తర్వాత పూజలు చేసి స్వామి, అమ్మవార్లకు తిరిగి ఆలయానికి చేర్చారు. వేదపండితులు చిట్టి శివ ఘనాపాఠీ, రమేష్ ఘనపాఠీ, ముష్టి పురుషోత్తం, అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు 'నాసా' సాయం



వస్తువులు అందజేస్తున్న తుని నాసా సంస్థ ప్రతినిధులు

రౌతులపూడి: గ్రామంలోని అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు తుని 'నాసా' స్వచ్ఛంద సేవాసంస్థ తమ వంతు ఆర్థిక సహాయం అందించింది.ఈ మేరకు సంస్థ ప్రతినిధి బత్తిన అప్పారావు ఆధ్వర్యంలో బాధిత కుటంబాలకు దుప్పట్లు, దుస్తులు, బియ్యం, కిరాణా, వంటసామగ్రి తదితర వస్తువులను అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సర్పంచ్ కటారి అర్జునమ్మ చేతుల మీదగా వాటిని బాధితులకు అందజేశారు.

వీరబాబుకు సత్కారం



వీరబాబును సత్కరిస్తున్న బండారు రాజా

జగ్గంపేట: జాతీయ స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన జగ్గంపేట యువకుడు బుద్ర శివసాయి వీరబాబును జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా శాలువాతో ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో జగ్గంపేట యువకుడు ప్రతిభ కనబరిచి జగ్గంపేటకు ప్రత్యేక గుర్తింపు తేవడం ఆనందంగా వుందని రాజా అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో సంయుక్త భారత్ ఖేల్ ఫౌండేషన్ పంకజ్ గపులే ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ కాంపిటేషన్‌లో 74 కేజీల విభాగంలో వీరబాబు రెండు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు జగ్గంపేటలోని శ్రీహనుమాన్ పవర్ జిమ్ కోచ్ కన్నారావు తెలిపారు. వీరబాబు జాతీయ స్థాయిలో రాణించడంతోపాటు దుబాయ్‌లో ఆగస్టులో జరిగే ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

స్వామి వారికి ప్రత్యేక పూజలు



ఏలేశ్వరంలో సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణంలో భాగంగా శనివారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాతృశక్తి దుర్గావాహిని మహిళా సంఘాలు సభ్యులతో స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. విష్ణుసహస్ర నామ పారాయణ, గోవింద నామాలు, లక్ష్మీసహస్ర నామార్చన, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీబీ ప్రసాద్, కటకం కిరీటి, మహిళా సభ్యులు కాబోలు దేవి, మల్లేశ్వరి, కామాక్షి, రామాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ జిల్లా మహాసభలు

తుని: ఈ నెల 10, 11 తేదీల్లో కాకినాడలో జరిగే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) మొదటి జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సంఘ జిల్లా నాయకుడు కేఎస్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొండవారిపేటలో కె.లోవరాజు అధ్యక్షతన కేవీపీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడతూ కుల వివక్ష, దళితుల భూమి సమస్యలు, సబ్‌ప్లాన్ నిధులు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా కేవీపీఎస్ పోరాడిందన్నారు. దళితుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టేలా సభలకు దళితులు తరలిరావాలన్నారు. అనంతరం సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. తుని పట్టణ కన్వీనర్‌గా కె.లోవరాజు, సభ్యులుగా వి.చక్రధర్, జి.లక్ష్మణ్, ఎస్.లక్ష్మణ్, ఆర్.నవీన్ ఎన్నికయ్యారు.

రైలు ప్రమాదంలో మండల గ్రామాల వారుంటే వివరాలు అందించండి

రౌతులపూడి: ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి సంబంధించి మండల గ్రామాల్లో ఎవరైనా ఉంటే సంబంధిత వివరాలు తహసీల్దారు కార్యాలయంలో గాని, స్థానిక సచివాలయంలో రెవెన్యూ అధికారులకు అందివ్వాలని తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించుకుని సంబంధిత కుటంబీకులు, రైలులో ప్రయాణిస్తున్న పూర్తి వివరాలు తప్పనిసరిగా అందించాలని ఆయన కోరారు.

చెరువుల పరిశీలన



తాళ్లూరులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గండేపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన చెరువు పనులను శనివారం కాకినాడ జిల్లా టీమ్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శ్రీనివాస్, అగ్రికల్చర్ ఏడీ కె.బాబూరావు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీ వె.రాజేశ్వరరావు, ప్రత్తిపాడు ఏపీడీ ఎం.భానుప్రకాష్ పరిశీలించారు. చెరువు గట్లు, గట్ల చుట్టూ మొక్కలు, తూములు, కలింగలు తదితర వాటిని పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. చెరువుల ఆయకట్టు విస్తీర్ణం ఏ మేరకు అభివృద్ధి చెందింది, తదితర వాటి గురించి రైతులతో మాట్లాడారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పి.సూరంపాలెం, తాళ్లూరు, మల్లేపల్లి గ్రామాల్లోని చెరువులను కూడా పరిశీలించినట్టు స్థానిక ఏపీఓ ఎస్ గంగాభవాని తెలిపారు. వీరి వెంట ఈసీ రమేష్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సర్పంచ్‌లు, రైతులు ఉన్నారు.

శరవేగంగా తుని-పైడికొండ రోడ్డు పనులు



ఎస్.అన్నవరంలో విస్తరించిన రహదారి

తుని రూరల్: తుని నుంచి ఎస్.అన్నవరం మీదగా తొండంగి మండలం పైడికొండ వరకూ చేపట్టిన రహదారి విస్తరణ, ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 9.70 కిలోమీటర్లు రహదారిని రోడ్లు, భవనాల శాఖ ఆధునీకరిస్తుంది. రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో కేంద్ర ప్రభుత్వం (సెంట్రల్ రోడ్ ఫండ్) నిధులు రూ.18 కోట్లు మంజూరయ్యాయి. మార్చి 22న రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ నిధులతో ఎస్.అన్నవరంలో నాలుగు వందల మీటర్ల పొడవునా సెంట్రల్ డివైడర్ ఇరువైపులా 7.5 మీటర్ల వెడల్పు రహదారి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఎస్సీపేట రోడ్డు వరకూ విస్తరణ పనులు, రహదారితో పాటు ఇరువైపులా సీసీ కాలువలను నిర్మిస్తున్నారు. పైడికొండ వరకు మిగిలిన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎస్.అన్నవరం గ్రామ శివారు నుంచి తారు రోడ్డు వేయనున్నారు. అందుకు అనువుగా రహదారిని ప్రొక్లెయిన్‌తో తవ్వి, దానిపై కంకర, బూడిద వేసి రోలింగ్ చేస్తున్నారు. ఈ నెలాఖరుకి పనులు పూర్తయ్యే అకాశాలు ఉన్నాయి. పనులు పూర్తయితే తుని నుంచి ఎస్.అన్నవరం మీదగా తొండంగి మండలం పైడికొండ, వేమవరం బీచ్‌రోడ్డు మీదగా ప్రయాణికులు కాకినాడకు తక్కువ సమయంలో సులభంగా చేరుకోవచ్చు.

జీపుజాతాకు స్వాగతం



తునిలో జీపుజాతా బృందానికి స్వాగతం పలుకుతున్న సీఐటీయూ ప్రతినిధులు

తుని: ఎన్నికల ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం, హామీల అమలు కోరుతూ శ్రీకాకుళం నుంచి అమరావతి వరకూ తలపెట్టిన జీపుజాతా శనివారం తుని చేరుకుంది. స్థానిక సీఐటీయూ అధ్యక్షుడు ధనలక్ష్మి ఆధ్వర్యంలో జీపు జాతా బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిమిటీ సభ్యులు తొట్ట నూకరాజు, ధనాల వెంకటరావు, గార్లపాటి లక్ష్మి, బంగారు వరలక్ష్మి, తుని సీఐటియూ నాయకులు లెక్కల శ్రీనివాస్, గొర్ల రమణ, షేక్ పద్మ పాల్గొన్నారు.

కేంద్ర బీమా పథకాలు వినియోగించుకోండి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌బీఐ రీజనల్ మేనజర్ సురేష్‌బాబు

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ మేనజర్ సురేష్‌బాబు అన్నారు. రామవరం పంచాయితీ ఆవరణలో డిపార్టుమెంట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్‌సీ)భారత కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసారు. జగ్గంపేట స్టేట్ బ్యాంకు మేనజర్ ఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ బీమా యోజన పథకాలను అమలుచేస్తోందని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను, బ్యాంకు అందిస్తున్న సేవలను జగ్గంపేట మేనజర్ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, గ్రామ ప్రముఖులు వైఎస్సార్ సీపీ నేత వత్సవాయి సత్యనారాయణ రాజు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఏబీవీ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పర్యవరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు పెంచాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యవరణ పరిరక్షణ ఉంటుందన్నారు. పర్యవరణ పరిరక్షణ కాపాడాలంటే మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పది లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు



పట్టుకున్న సారా, నిందితుడితో పోలీసు సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో పది లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ శనివారం తెలిపారు. కిర్లంపూడి మండలం సోమరాయణపేటలో దారిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై పది లీటర్ల సారాను తరలిస్తున్న పెద్దాపురం మండలం తుర్పుపాకల గ్రామానికి చెందిన పుసుపులేటి చిన్నదుర్గను అదుపులోకి తీసుకున్నారు. వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సోమరాయణపేటకు చెందిన సారా కొనుగోలుదారు ఆడారి జగదీశ్వరరావుపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

శంఖవరం: నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈఓ ఎస్‌వీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల నుంచి వై.మురళీ, ఎం.అనువాడు, ఎన్.సత్యజానకి, మండపం జెడ్పీ హైస్కూల్ నుంచి కాసంశెట్టి దేవి, అల్లు కామరాజు ఎంపికైనట్టు తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు ఉత్తమ్మ ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



గోకవరంలో సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు పర్చుకోవచ్చని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గోకవరం పంచాయతీ కార్యాలయంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావులు స్థానిక విద్యార్థులతో కలిసి గ్రామంలో సైకిల్ తొక్కి సైక్లింగ్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ భారతి, సిబ్బంది పవన్, రమణ, నాగలక్ష్మీ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పాకలను తొలగిస్తున్న అధికారులు

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్ కార్యాలయం సమీపంలో మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి తొమ్మిది పాకలు నిర్మించి వాటిలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి ఆ పాకలను గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు తొలగించారు. పాకల్లో ఉంటున్న వారిలో కొంత మందికి రెండు, మూడు సొంతిళ్లు ఉన్నాయని గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా తెలిపారు. పాకల స్థలంలో మాంసం విక్రయ మార్కెట్ ఉండడంతో సత్యదేవుని ఊరేగింపునకు ఇబ్బందిగా ఉందని, వాటిని వేరే ప్రాంతానికి మార్చాలని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ గత నెలలో పంచాయతీ అధికారులను కోరినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకురాగా ఆయన కూడా ఆ పాకలు తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు. దీంతో పాకలు తొలగింపునకు చర్యలు తీసుకున్నామని, దీనివల్ల సుమారు ఎకరం స్థలం కాపాడుకున్నామని, అక్కడ షాపుల సముదాయం నిర్మించి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. పాకల తొలగింపులో అన్నవరం ఇన్‌చార్జి ఎస్ఐ అజయ్‌బాబు, ఇతర పోలీసులు పాల్గొన్నారు.

రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అన్నీ సిద్ధం

- కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



రౌతులపూడిలో పంచాయితీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

రౌతులపూడి: నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు రౌతులపూడిలో అన్ని చర్యలు పూర్తయ్యాయని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలోని భవన సముదాయం, గదులు, కార్యాలయం చుట్టుపక్కల ప్రదేశాలపై ఆరా తీశారు. అదేవిధంగా గ్రామంలోని ప్రధాన రహదారిలోని సినిమా సెంటర్, గిడజాం సెంటర్, ఎస్.పైడిపాల సెంటర్, తహసీల్దారు కార్యాలయ పరిసర ప్రాంతాలను తదితర పలు ప్రదేశాలను ఆయన స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి పలు అంశాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సూచనలు మేరకు పంచాయతీ కార్యాలయం అనువైనది గుర్తించామని ఇప్పటికే పూర్తి సమాచారంతో కూడిన నివేదికను పోలీస్ ఉన్నతాధికారులకు అందించామని తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారులు అధికారిక ఉత్తర్వులు మేరకు త్వరలో వీలైనంత దగ్గరలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, డీసీసీబీ డైరెక్టర్ పులి మదు, ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు, ఎస్.ఐ అజయ్‌బాబు ఉన్నారు.

బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి

ఏలేశ్వరం: ఒడిశాలో రైలు ప్రమాద బాధితులకు వెంటనే న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక వినోద్ మిశ్రా నగర్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైలు ప్రమాదంలో చనిపోయిన, క్షతగాత్రులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం చెయ్యాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రమాదం ఘటనపై న్యాయ విచారణ చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, ఉమ్మిడి పాదాలమ్మ, సంకురమ్మ, సుందరి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

జగ్గంపేట: ఒడిశాలోని బాలాసోర్ జిల్లా బహనాగులో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు అన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు కమిటీలు వేయడం వల్ల ప్రయోజనం లేదని, ఎప్పటికప్పుడు శాఖపరమైన నిశిత పరిశీలన ఉండాలన్నారు. మృతులకు, గాయపడిన వారికి నష్ట పరిహారంగా ప్రభుత్వం పెద్ద మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

క్రీస్తు సేవలు ఆచరణీయం



పాస్టర్ రవికుమార్‌ను సన్మానిస్తున్న సంఘస్తులు

ఏలేశ్వరం: క్రీస్తు సేవలు ఆచరణీయమని పాస్టర్ శామ్యూల్ రవికుమార్ అన్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని లూథరన్ చర్చ్‌లో శనివారం పాస్టర్ సామ్యూల్ రవికుమార్‌ను సంఘస్తులు ఘనంగా సన్మానించారు. పాస్టర్ రవికుమార్ భీమవరం బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపులను రక్షించేందుకు క్రీస్తు మళ్లీ జన్మించాడన్నారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో పేకల జాన్, ఉదయ్‌కుమార్, వత్సలరావు, బాబులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అమ్మాజీపేట కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నాగదుర్గారావు

తుని: రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ నాగదుర్గారావు సూచించారు. శనివారం స్థానిక సీతారామపురం, అమ్మాజీపేట 9, 10 వార్డుల్లో వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగదుర్గారావు మాట్లాడతూ ద్విచక్ర, భారీ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఏమాత్రం అలసత్వం వహించినా విలువైన ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. నేరాలకు సంబంధించి అనేక సమస్యలపై అవగాహన కల్పించారు. వేసవి ముగిసే వరకూ పట్టణ వాసులంతా దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందరాజులు, కొప్పిరెడ్డి సత్తిబాబు, ఎం.గణేష్, నూకరాజు పాల్గొన్నారు.

గండేపల్లి: వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై.గణేష్ కుమార్ తెలియజేశారు. మల్లేపల్లిలో శనివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో జరుగు దొంగతనాల తీరును వివరిస్తూ, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించొద్దని, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

శిక్షణ తరగతులతో ఎంతో ప్రయోజనం

జగ్గంపేట: నూతన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల ఎంతో ప్రయోజనం ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బింధుమాధవి తెలిపారు. శనివారం జగ్గంపేటలో విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోటలో ఈనెల ఒకటో తేదీ నుంచి 3వ తేదీ వరకూ ఇచ్చిన శిక్షణలో పంచాయతీరాజ్ చట్టం, స్థానిక సంస్థల నిర్వహణ ఆదాయ వనరులు, జిల్లా పరిషత్ ఏర్పాటు, చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక, అవిశ్వాస తీర్మానం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను వివరించారన్నారుజ. వీటిపై అవగాహన ఉండడం వల్ల ప్రజలకు ఉత్తమ సేవలందుతాయన్నారు. శిక్షణ అనంతరం జిల్లా అధికారులు సర్టిఫికెట్లు అందచేశారని తెలిపారు.